క్లుప్తంగా

కొత్త సచివాలయం ప్రారంభం



ప్రారంభోత్సవ పూజలు చేస్తున్న అధికారులు

పూతలపట్టు: మండలంలోని వేపనపల్లి సచివాలయం సోమవారం ప్రారంభమైంది. ఎంపీడీఓ గౌరి, తహసీల్దార్ విజయభాస్కర్ ప్రారంభోత్సవ పూజలు చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ కష్టపడి పనిచేసి, ప్రజలకు సేవ చేయడం ద్వారా ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గణపతిరెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నవమి వేడుకలకు విరాళం

చిత్తూరు అర్బన్: చిత్తూరు టూటౌన్ లైన్ పోలీస్ క్వార్టర్స్, పీజీఆర్ లైన్ పోలీస్ క్వార్టర్స్‌లో ఈ నెల 30న జరిగే శ్రీరామ నవమి వేడుకల నిర్వహణకు ఎస్పీ రిశాంత్ రెడ్డి రూ.20 వేలు విరాళం అందించారు. ఇందులో భాగంగా సీతారాముల కల్యాణోత్సవాన్ని ఎప్పటిలాగే ఘనంగా నిర్వహించాలన్నారు. అందరూ పాల్గొనేలా చూడాలని ఆయన పేర్కొన్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ బడ్జెట్ సమావేశం మంగళవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు నగర మేయర్ ఎస్.అముద సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశమందిరంలో జరిగే ఈ సమావేశానికి ఎక్స్ అఫిషియో సభ్యులు, కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు హాజరుకావాలని కోరారు.

నేడు వాహనాల వేలం

గుడిపాల: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వివిధ కేసుల్లో పట్టుబడిన నాలుగు ద్విచక్ర వాహనాలను వేలం వేయనున్నట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. మంగళవారం సాయంత్రం 5 గంటలకు వాహనాలు వేలం వేయనున్నట్లు చెప్పారు. వేలంలో పాల్గొనదలచిన వారు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: స్థానిక పోలీస్ స్టేషన్‌లో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు ఎస్‌ఐ ప్రసాద్ తెలిపారు. ఆసక్తి కలిగిన వారు డిపాజిట్లు చెల్లించి వేలంలో పాల్గొనాలని వివరించారు.

విద్యాసామగ్రి వితరణ

చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని కట్టమంచి మునిసిపల్ హైస్కూల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు విద్యాసామగ్రిని వితరణ చేశారు. జిల్లా ఈడిగ గౌడ్ సంఘం అధ్యక్షులు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఆ సంఘ నాయకులు విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు, సర్టిఫికెట్లు దాచుకునే ఫైళ్లను అందజేశారు.

వడ్డీ మాఫీకి నాలుగు రోజులే గడువు

చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తి, ఖాళీ జాగా పన్నులకు సంబంధించి పాత బకాయిలపై వడ్డీ మాఫీ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ అరుణ కోరారు. వడ్డీ మాఫీ అవకాశం మార్చి నెలాఖరు వరకే వర్తిస్తుందని, ఈ అవకాశాన్ని పన్ను చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పన్ను చెల్లింపులను అన్ని వార్డు సచివాలయాల్లోనూ, ఆన్‌లైన్‌లో, క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా చెల్లించవచ్చని వివరించారు. నగరపాలక సంస్థ పరిధిలో పన్నుల వసూళ్లపై కమిషనర్ సూపర్‌వైజర్ అధికారులు, రెవెన్యూ అధికారులు, అడ్మిన్ కార్యదర్శుల బృందాలతో సమీక్ష నిర్వహించారు. పన్ను చెల్లింపు గడువు సమీపిస్తున్న నేపథ్యంలో మొండి, పాత బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. వడ్డీ మాఫీ అంశాన్ని వివరించి పన్నులు కట్టించాలన్నారు. వార్డుల వారీగా ఆస్తి పన్ను డిమాండ్, వసూలు అంశాలపై సమీక్ష నిర్వహించారు.

6న రెడ్ క్రాస్ ఎన్నికలు

చిత్తూరు రూరల్: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికలను ఏప్రిల్ 6వ తేదీన నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి బ్రహ్మానందం రెడ్డి తెలిపారు. నగరంలోని రెవెన్యూ భవనంలో ఉదయం 10 గంటలకు ఎన్నికలు ప్రారంభమవుతాయని చెప్పారు. సభ్యులు ఈ ఎన్నికల్లో పాల్గొనాలన్నారు.

అరుణగిరిపై ప్రత్యేక పూజలు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎన్‌కండ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే స్వామివారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. కొండమల్లీశునికి పాలాభిషేకం చేశారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయస్వామికి పూజలు చేశారు. ఆలయ ఆవరణలో చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



భక్తులకు ప్రసాదాలు అందజేస్తున్న అర్చకుడు

రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఎన్నో ఏళ్లుగా నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తూ వస్తోంది. ఇప్పటికే నాడు–నేడు పథకం కింద ఆరోగ్య కేంద్రాల భవనాల రూపు రేఖలను మార్చేసింది. ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను దశలవారీ భర్తీ చేస్తోంది. దీంతోపాటు వైద్యుల పర్యవేక్షణకు పకడ్బందీ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. అవసరమైన మందులు సరఫరా చేస్తోంది. క్రమంగా వైద్య సేవలు మెరుగుపడుతున్నాయి. వైద్య సిబ్బంది నిరంతరం ఆరోగ్యకేంద్రాలకు హాజరవుతున్నారు. రోగులకు ఆప్యాయంగా చిత్తశుద్ధితో వైద్య సేవలు అందిస్తున్నారు. అత్యవసర వైద్యం అందుబాటులోకి వచ్చిందన్న సంతోషం గ్రామీణుల్లో కనిపిస్తోంది.

ముంగిట్లో అత్యవసర వైద్యం



- నియోజకవర్గంలో 8 ఆరోగ్య కేంద్రాలు
- ఒక్కో కేంద్రానికి ఇద్దరేసి వైద్యుల నియామకం
- గ్రామీణులకు వరంలా మారిన ప్రభుత్వ వైద్యం

ఆరోగ్య కేంద్రాల వివరాలు

ఐరాల మండలం: కాణిపాకం, ఐరాల
యాదమరి మండలం: సంతగేటు, మాదిరెడ్డిపల్లె
బంగారుపాళెం మండలం: తుంబకుప్పం
తవణంపల్లె మండలం: తవణంపల్లె
పూతలపట్టు మండలం: పూతలపట్టు, బి.కొత్తకోట (సీహెచ్‌సీ)

ఐరాల: గతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అలంకారప్రాయంగా ఉండేవి. వైద్యులు ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళతారో తెలిసేది కాదు. ఒక వేళ వైద్యులు అందుబాటులో ఉన్నా మందులు ఉండేవి కావు. అసలు అక్కడ వైద్య సేవలే ఉండవని ప్రజలు బలంగా నమ్మేవారు. ఎందుకంటే అప్పట్లో తాత్కాలిక పద్ధతిలో వైద్యులను నియమించే వారు. దీంతో చాలామంది వైద్యులు మూరుమూల ప్రాంతాల్లో ఉద్యోగం చేయడం ఇష్టం లేక మధ్యలోనే వెళ్లిపోవడంతో పోస్టులు ఖాళీగా ఉండేవి. ఇద్దరు డాక్టర్లు ఉన్న చోట ఒక్కరే విధులు నిర్వహించే వారు. దీంతో జనం పీహెచ్‌సీల వైపే వెళ్లేవారే కాదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ముందుగా భవనాల మరమ్మతులు, ఆధునికీకరణ పనులు చేపట్టింది. ఆ తరువాత వైద్యుల కొరతను తీరుస్తోంది. వైద్య ఆరోగ్య శాఖ ద్వారా శాశ్వత వైద్యుల నియామకానికి శ్రీకారం చుట్టింది.

రెండు పీహెచ్‌సీలకు నలుగురు వైద్యులు

ఐరాల పీహెచ్‌సీలో డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ పూర్ణలత విధులు నిర్వర్తిస్తున్నారు. కాణిపాకం పీహెచ్‌సీలో నూతనంగా డాక్టర్ శ్రీనివాస్‌ను నియమించారు. ఒక్కో పీహెచ్‌సీకి నలుగురు డాక్టర్లు అందుబాటులో ఉన్నారు. జ్వరం, జలుబు, దగ్గు, మలేరియా, వాంతులు, చికెన్‌గున్యా, ప్రసవాలు, విరేచనాలు, పాముకాటు వంటి అత్యవసర కేసులకు ఐరాల, కాణిపాకం పీహెచ్‌సీల్లోని వైద్యులు అత్యవసర చికిత్సను అందిస్తున్నారు. గతంలో ఈ రెండు పీహెచ్‌సీల్లో సరైన వైద్యులు లేక, వైద్య పరికరాలు అందుబాటులోలేక జ్వరం, దగ్గు వంటి వ్యాధులకు కూడా 25 కి.మీ. దూరంలో ఉన్న జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లేవారు. ప్రస్తుతం అన్ని రకాల రోగాలకు వైద్యం చేస్తూ అభినందనలు అందుకుంటున్నారు.

122 గ్రామాలకు వైద్య సేవలు

ఐరాల పీహెచ్‌సీ పరిధిలో 96 గ్రామాలు, 28,657 జనాభా, 10 సచివాలయాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో రోగులను వైద్యులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. కాణిపాకం పీహెచ్‌సీ పరిధిలో 26 గ్రామాలు, 24,502 జనాభా, 9 సచివాలయాలు ఉన్నాయి. ప్రస్తుతం వ్యైదుల కొరత తీరింది. కావాల్సినంత మంది వైద్య ఆరోగ్య సిబ్బంది ఉండడంతో గ్రామాల్లో వైద్యం మెరుగుపడింది. ఉపకేంద్రాల్లో కేవలం టీకాలు, తల్లీబిడ్డకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహిస్తుండేవారు. ఏఎన్‌ఎంల ఆధ్వర్యంలో కొనసాగిన ఈ కేంద్రాలు ప్రస్తుతం ఎంబీబీఎస్ వైద్యుల ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. ప్రభుత్వాస్పత్రిలో ఉన్న పరీక్ష కేంద్రాల్లో మరికొన్ని రకాల రక్త పరీక్షలకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వడంతో గ్రామీణ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. డెంగీ, టైఫాయిడ్ వంటి విష జ్వరాలతో బాధపడుతున్న వారికి తక్షణమే మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నారు. క్షయ, బీపీ, షుగర్, గుండె జబ్బులు, క్యాన్సర్లు, కిడ్నీ సంబంధిత వ్యాధులను ముందే గుర్తించి వైద్య సూచనలు, సలహాలు ఇస్తున్నారు. మంచానికే పరిమితమైన రోగుల ఇంటి వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేస్తున్నారు.



గర్భిణికి సేవలందిస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

రోగులకు మెరుగైన వైద్యం

ఐరాల పీహెచ్‌సీలో రోగులకు మెరుగైన వైద్యం అందిస్తున్నాం. మా పీహెచ్‌సీలో ప్రతి రోజు 100 మంది వరకు ఓపీలకు సేవలందిస్తున్నాం. గర్భిణులకు ప్రత్యేక వైద్యంతో పాటు సుఖ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. మా పీహెచ్‌సీ పరిధిలో 96 గ్రామాలు ఉన్నాయి. అత్యవసర కేసులు, సాధారణ కేసులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఇద్దరు డాక్టర్లు ఎప్పుడూ అందుబాటులో ఉంటున్నాం.

–వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, ఐరాల, పీహెచ్‌సీ

బాధ తీరింది



కీళ్లనొప్పులతో బాధపడుతూ ఉండేదాన్ని. గతంలో ఆస్పత్రికి వెళితే డాక్టర్లూ ఉండరు, నర్సులు ఇచ్చే మందులు మింగినా నొప్పి తగ్గేది కాదు. దీంతో మెడికల్ షాపులో మందులు కొనుగోలు చేసుకునేవాళ్లం. ప్రస్తుతం డాక్టర్లు ఇంటి వద్దకు వచ్చి కీళ్లనొప్పులకు మందులు ఇస్తున్నారు. ఇప్పుడు నా కీళ్లనొప్పుల బాధ తీరింది. ఇప్పుడు ఆరోగ్య కేంద్రాన్ని చూస్తేనే వెళ్లాలనిపిస్తోంది.

–ప్యారి, వి.యస్ అగ్రహారం



వైద్య సేవలందిస్తున్న డాక్టర్ పూర్ణలత

బాధ్యతలు స్వీకరించిన వైద్యులు

బంగారుపాళెం: ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ వైద్యులు సోమవారం విధులు చేపట్టినట్లు మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్‌చెంగల్‌రాయన్ తెలిపారు. మండలంలోని తుంబకుప్పం పీహెచ్‌సీలో ఏఎఫ్‌పీసీ వైద్యులుగా లోకేష్, రమేష్ బాధ్యతలు స్వీకరించారని చెప్పారు. ప్రభుత్వం చేపట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారులు మండలంలో గ్రామీణ ప్రజలకు ఇంటింటికీ వెళ్లి వైద్య సేవలు అందించనున్నట్లు వివరించారు.




వైద్యులు లోకేష్, రమేష్

ఘనంగా కార్పెంటర్స్ దినోత్సవం



కార్పెంటర్స్ దినోత్సవంలో భాగంగా కేక్ కట్‌చేస్తున్న అధికారులు, కార్మికులు

చిత్తూరు అర్బన్ : కార్పెంటరీ దినోత్సవం సందర్భంగా ఉచిత కార్పెంటరీ సేవలను అందించడం అభినందనీయమని చిత్తూరు రెండో పట్టణ సీఐ మద్దయ్య ఆచారి అన్నారు. కార్పెంటర్స్ దినోత్సవాన్ని చిత్తూరు జిల్లా కార్పెంటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం చిత్తూరులో ఘనంగా నిర్వహించారు. సంఘం సభ్యులు స్థానిక చిత్తూరు రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో వడ్రంగి పనులను ఉచితంగా నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా కార్పెంటర్ వెల్ఫేర్ అసోసియేషన్ హెచ్–195 ఆధ్వర్యంలో పలు కార్యాలయాల్లో ఉచిత సేవలను అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షుడు కుమరేష్, చంద్రశేఖర్, మోహనాచారి, మజార్ అలీ భాయ్, కోదండచారి, గణేష్, కుమార్, నరసింహ, రాజేంద్రచారి, సుందర్ పాల్గొన్నారు.

మట్టి అక్రమ తరలింపుపై ఫిర్యాదు

బంగారుపాళెం: మండలంలో చేపట్టిన ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు పనులకు గిరిజనుల భూముల నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్నారంటే గ్రామస్తులు సోమవారం రెవెన్యూ అధికారులకు, ఎంపీపీ అమరావతి, వైఎస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ, మండలంలోని జయంతి యానాదులకు ప్రభుత్వం సాగుభూములను మంజూరు చేసినట్లు వివరించారు. అయితే కాంట్రాక్టు సంస్థకు చెందిన వారు చెన్నై–బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు నిర్మాణ పనుల కోసం తమ సాగు భూముల్లో మట్టిని తరలిస్తున్నట్లు తెలిపారు. మట్టిని తరలిస్తే భూములు సాగుకు పనికిరాకుండా పోతాయని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు, ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి గిరిజనుల భూముల్లో మట్టి తరలించకుండా చర్యలు చేపట్టాలని కోరారు.



ఎంపీపీకి వినతి పత్రమిస్తున్న గిరిజనులు

ఘనంగా మెడికల్ కళాశాల గ్రాడ్యుయేషన్ డే

చిత్తూరు రూరల్: వైద్య విద్యలో పట్టుసాధించి, బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించాలని అపోలో కళాశాల వైస్ చైర్‌పర్సన్ ప్రీతారెడ్డి అన్నారు. చిత్తూరు నగరంలోని అపోలో మెడికల్ కళాశాలలో సోమవారం గ్రాడ్యుయేషన్‌డేను ఘనంగా నిర్వహించారు. ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సమాజంలో వైద్య విద్య ప్రధానమైనదన్నారు. కార్యక్రమంలో అపోలో నిర్వాహకులు నరేష్‌కుమార్‌రెడ్డి, అగస్టిన్, సుధాకర్ బాబు, వినోద్ భట్ పాల్గొన్నారు.

వరసిద్ధుని సేవలో అపోలో ఎండీ

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని అపోలో ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ ప్రీతారెడ్డి సోమవారం దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆమె స్వామివారి దర్శనార్థం విచ్చేయగా ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.



గ్రాడ్యుయేషన్ డే ప్రారంభోత్సవంలో ప్రీతారెడ్డి

ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

చిత్తూరు రూరల్: బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని నగరంలోని శ్రీకోదండరామస్వామి ఆలయంలో సోమవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సుగంధ ద్రవ్యాలతో ఆలయ శుద్ధి చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు వేణుగోపాల్, ఈఓ సుబ్రమణ్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు నియోజకవర్గానికి చెందిన ఇద్దరు మహిళలకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి వచ్చిన చెక్కులను సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అందజేశారు. స్థానిక గంగనపల్లెకు చెందిన లహరికి రూ.2.80 లక్షలు, చిత్తూరు రూరల్ బీఎన్ఆర్‌పేట ప్రాంతానికి చెందిన సోనిక రూ.42,000 చెక్కులను అందజేశారు.



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

ఫ్యామిలీ ఫిజీషియన్‌కు అనూహ్య స్పందన




తవణంపల్లె: అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న వైద్య బృందం, యాదమరి: దాసరాపల్లెలో వడదెబ్బపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

తవణంపల్లె: మండలంలోని ఎగువ మారేడుపల్లెలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎగువ మారేడుపల్లెలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక 75 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అదే విధంగా గర్భవతులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని వైద్యాధికారుల బృందం పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనాలు అందించాలని డాక్టర్ ప్రియాంక తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు సుబ్రమణ్యం రెడ్డి, శ్రీనివాసులు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు అవసరం

యాదమరి: వేసవిలో వడదెబ్బ బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి అనిల్ కుమార్ నాయక్ తెలిపారు. దాసరాపల్లె ఆరోగ్యఉప కేంద్రం పరిధిలోని గ్రామీణ ప్రజలకు సోమవారం వడదెబ్బపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రోజు రోజుకూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో కూలీలు, గ్రామీణ ప్రజలు ఉదయం 10 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఆరుబయట తిరగరాదన్నారు. గ్రామీణ ప్రజలు ఎండ తీవ్రతకు నీరసంగా ఉంటే ఆస్పత్రి సిబ్బంది వద్ద ఓఆర్ఎస్ పౌడర్ ఉంటుందని, వాటిని నీటిలో కలిపి తీసుకోవాలని కోరారు. జ్వరాలు వచ్చిన వెంటనే ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మొగిలి శివాలయంలో రాహుకేతు పూజలు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం రాహు కేతు పూజలు ఘనంగా నిర్వహించినట్లు ఈఓ మునిరాజ తెలిపారు. స్వయంభు మొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ మూలవర్లకు ఉదయం ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఉదయం 7.30 నుంచి 9 గంటల వరకు రాహు, కేతు, సర్పదోష నివారణ పూజలు చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు దోష నివారణ పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


చిరుధాన్యాలతో రోగనిరోధక శక్తి పెంపు

పూతలపట్టు: చిరుధాన్యాలు ఉపయోగించడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరత్నం తెలిపారు.మండలం కేంద్రంలో సోమవారం నిర్వహించిన పోషణ్ పక్వాడా పక్షోత్సవాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలింతలు పాల్గొన్నారు. చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం మూలంగా శరీరానికి మంచి పోషకాలు అందుతాయని తెలిపారు. రాగులు, జొన్నలు, సజ్జలు వంటి వాటిలో అధిక పోషకాలు ఉంటాయని తెలిపారు. గర్భిణులు, కిశోర బాలికలు ఆహారంలో ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు తప్పక వాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

స్పందన వినతులకు పూర్తి పరిష్కారం


చిత్తూరు: అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ అరుణ, యాదమరి: తహసీల్దార్ చిట్టిబాబుకు అర్జీ ఇస్తున్న బాధితుడు, పూతలపట్టు: వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ విజయభాస్కర్

చిత్తూరు అర్బన్: స్పందన కార్యక్రమంలో అందే వినతులను క్షేత్రస్థాయిలో విచారించి పూర్తి స్థాయిలో పరిష్కరించాలని నగర కమిషనర్ అరుణ అధికారులను ఆదేశించారు. నగరపాలక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కమిషనర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వినతులు, ఫిర్యాదులపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. స్పందన వినతుల పరిష్కారంపై సమీక్ష నిర్వహించారు. ప్రజారోగ్య విభాగం –2, ప్రణాళిక విభాగం –2, రెవెన్యూ, ఇంజినీరింగ్ విభాగాలకు సంబంధించి ఒక్కొక్క ఆరు వినతులు అందాయి. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంఈ ధనలక్ష్మీ, మేనేజర్ ఉమామహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్పందన సమస్యలను పరిష్కరిస్తాం

పూతలపట్టు: స్పందన సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని తహసీల్దార్ విజయభాస్కర్ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. రైతులు పాసుపుస్తకం, రేషన్‌కార్డుల్లో మార్పులు చేర్పులు, భూ సమస్యలపై ఫిర్యాదు అధికంగా వచ్చినట్లుఅ తహసీల్దార్ పేర్కొన్నారు. సమస్యలను వేగవంతంగా పరిష్కరిస్తానని అర్జీదారులకు భరోసా ఇచ్చారు.

వీఆర్వోల నిర్లక్ష్యంపై ఫిర్యాదు

యాదమరి: ఆన్‌లైన్‌లో భూములు నమోదు చేయాలని పలుమార్లు అర్జీలు ఇచ్చినప్పటికీ వీఆర్‌ఓలు పట్టించుకోవడం లేదని చిన్నిరెడ్డిపల్లె గ్రామస్తులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతు వీఆర్‌ఓలు చాల నిర్లక్ష్యంగా ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందని చెప్పారు. త్వరంలో వారిపై నివేదికలు సిద్ధం చేసి కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

గుడిపాల: చెన్నై– బెంగళూరు జాతీయ రహదారిలోనికడప నుంచి వేలూరుకు సిమెంట్ లోడ్‌తో వెళ్తున్న ఓ లారీ సోమవారం అదుపుతప్పి మండల కేంద్రంలో డివైడర్‌ను ఢీకొంది. అయితే ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. వెంటనే పోలీసులు లారీని క్రేన్ సాయంతో అక్కడి నుంచి పక్కకు తరలించారు.

